بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 20 February 2026 (Telugu)

# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వచ్ఛమైన దాసుని దైవ ప్రార్థనల ఆసక్తికర మరియు ముస్లిహ్ మౌఊద్ భవిష్యవాణి గూర్చి విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 20.02.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా అనుగ్రహంతో నిన్నటి నుండి రమజాన్ ప్రారంభమైనది. అల్లాహ్ తఆలాతో సంబంధాన్ని పటిష్టం చేసుకోవడానికి, మన ఆత్మశుద్ధి కోసం అల్లాహ్ తఆలా ఈ ఉపవాస మాసాన్ని మనకు ప్రత్యేకంగా ప్రసాదించాడు. అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీకి ఈ నెల నుండి గరిష్ట ప్రయోజనం పొందుటకు అనుగ్రహించుగాక! అయితే రమజాన్ ముగిసిన తర్వాత కూడా మనం దైవప్రేమ, ఆరాధనల ప్రమాణాలను కొనసాగించడమే కాకుండా, వాటిని మరింత మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నించినప్పుడే నిజమైన ప్రయోజనం లభిస్తుందని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవలెను. అప్పుడే మనం మన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చగలుగుతాము.

గత కొన్ని శుక్రవారాల నుండి నేను పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దైవప్రేమ, వారి ఆరాధనా పద్ధతులు, ప్రమాణాలు, విశ్వాసులు వీటిని ఆచరించడానికి వారు చేసిన హితబోధలు, మార్గదర్శకాల గురించి వివరిస్తూ వస్తున్నాను. ఆ తర్వాత వారి సత్య దాసులైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఉత్తమ ఆదర్శాన్ని అనుసరించిన వృత్తాంతాలను కూడా వివరించాను. ఈ అంశం ఇంకా కొనసాగుతోంది. నేడు రమజాన్ సందర్భాన్ని పురస్కరించుకుని ఇదే విషయం కొనసాగుతుంది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మనం ఈ సంఘటనలను కేవలం విని ఆనందించడమే కాకుండా, ఇవి మనకు మార్గదర్శకాలుగా ఉండవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి జీవిత సంఘటనలలో హజ్రత్ సాహిబ్జాదా మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు అన్హు గారు మౌల్వీ ముహమ్మద్ అబ్దుల్లాహ్ బటాల్వీ (రజి) గారి కథనం గురించి ఉటంకించిన ఒక కథనాన్ని ప్రస్తావిస్తూ హుజూరె అన్వర్ ఇట్లనిరి. దీని ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి అల్లాహ్ తఆలాతో ఉన్న సంబంధం, వారి దైవభీతి, పవిత్రత, ఆరాధనల పట్ల వారికి ఉన్న అమితమైన ఆసక్తిపై వెలుగు పడుతుంది. అందుకే నేను దీనిని ప్రస్తావించడం అవసరమని భావిస్తున్నాను.

శ్రీమతి అమతుర్రహ్మాన్ గారిలా వివరించారు: ఒకరోజు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరియు హజ్రత్ ఉమ్ముల్ ముమినీన్ గారు కళ్లు మూసుకుని కాగితంపై రాయవచ్చా లేదా అని పరీక్షించాలను

కున్నారు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక కాగితం ముక్కను తీసుకుని దానిపై ఈ క్రింది వాక్యాన్ని వ్రాశారు. అది నాకు ఒక్కక్క అక్షరం గుర్తుండి పోయింది. హుజూర్ (అ) కళ్లు మూసుకున్న స్థితిలో రాసింది ఏమిటనగా మనిషి ప్రతి క్షణం అల్లాహ్ తఆలాకు భయపడుతూ ఉండాలి, ఐదు పూటల నమాజులలో అతని సన్నిధిలో ప్రార్థిస్తూ ఉండాలి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కావున హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారు తనను అనుసరించేవారికి ఎల్లప్పుడూ బోధించిన ప్రమాణం ఇదే. తనను అనుసరించేవారు మాత్రమే కాకుండా, ప్రతి విశ్వాసి కూడా దైవభీతి కలిగిన వ్యక్తిగా ఉండాలని, ఎల్లప్పుడూ ఆరాధనల పట్ల శ్రద్ధ వహించేవానిగా ఉండాలని వారు నిరంతరం ఆకాంక్షించేవారు.

ఇలాగే హజ్రత్ సాహిబ్జాదా మిర్జా బషీర్ అహ్మద్ (రజి) గారు మరొక సంఘటనను వివరించారు: మియాఁ అబ్దుల్లాహ్ సన్నూరీ (రజి) గారు తెలిపిన వివరాల ప్రకారం, హజ్రత్ గారు (అ) 1884లో ఖాదియాన్ బయట 'చిల్లా' (ఏకాంత ప్రార్థనలు) చేయాలని, భారతదేశం పర్యటించాలని సంకల్పించారు. మొదట గుర్దాస్‌పూర్ జిల్లాలోని సుజాన్‌పూర్‌లో ఏకాంతంగా గడపాలని అనుకున్నారు, కానీ ఆ తర్వాత 'నీ చిక్కుముడులన్నీ హోషియార్‌పూర్‌లో వీడతాయి' అని వారికి దైవవాణి అందింది. అందువల్ల, జనవరి 1886లో హోషియార్‌పూర్ వెళ్లడానికి ముందు నన్ను ఖాదియాన్‌కు పిలిపించారు. హోషియార్ పూర్ ప్రముఖులైన షేక్ మెహర్ అలీ గారికి ఒక లేఖ ఇట్లు వ్రాయబడింది. నేను రెండు నెలల పాటు హోషియార్‌పూర్ రావాలనుకుంటున్నాను, నగర శివార్లలో ఉన్న ఒక మేడ గది ఏర్పాటు చేయండి. కనుక వారు 'తవేలా' అని పిలవబడే తమ నివాసాన్ని ఖాళీ చేయించారు. హుజూర్ (అ) ఎడ్లబండిపై కూర్చుని బియాస్ నది మార్గం ద్వారా ప్రయాణించారు. వారితో పాటు మియాఁ అబ్దుల్లాహ్, షేక్ హామిద్ అలీ మరియు ఫతహ్ ఖాన్ ఉన్నారు. నది దాటడానికి ఒక పడవను తీసుకున్నారు. పడవ నడుస్తున్నప్పుడు హుజూర్ (అ) ఇట్లన్నారు. మియాఁ అబ్దుల్లాహ్! ఒక పరిపూర్ణ మానవుని సాంగత్యం ఈ నదీ ప్రయాణం వంటిది. ఇందులో ఒడ్డుకు చేరుతామనే ఆశ ఉంటుంది మరియు మునిగిపోతామనే భయం కూడా ఉంటుంది. మియాఁ అబ్దుల్లాహ్ గారిలా అన్నారు. నేను హుజూర్ చెప్పిన ఈ మాటను అప్పుడు మామూలుగానే విన్నాను, కానీ ఆ తర్వాత ఫతహ్ ఖాన్ ధర్మభ్రష్టుడు అయినప్పుడు నాకు ఈ మాట గుర్తుకు వచ్చింది.

హుజూర్ అలైహిస్సలాం ఒక కరపత్రం ద్వారా ఇలా ప్రకటించారు. నలభై రోజుల వరకు నన్ను కలవడానికి ఎవరూ రాకూడదు, నన్ను విందుకు కూడా పిలవకూడదు. ఈ నలభై రోజులు గడిచిన తర్వాత నేను మరో ఇరవై రోజులు ఇక్కడే ఉంటాను. ఆ ఇరవై రోజులలో కలవడానికి, ప్రశ్నలు అడగడానికి అనుమతి ఉంటుంది. మాకు కూడా ఇలా ఆజ్ఞాపించారు. ప్రవేశ ద్వారం గొలుసు ఎల్లప్పుడూ వేసి ఉండవలెను, ఇంట్లో కూడా ఎవరూ నన్ను పిలవకూడదు, ఎవరూ పైకి రాకూడదు. నేను నమాజు కూడా పైనే ఆచరిస్తాను. జుమా నమాజ్ కోసం హుజూర్ (అ) ఇలా సూచించారు. నగరం చివరన ఏదైనా నిర్మానుష్యంగా ఉన్న మసీదును వెతకండి, అక్కడ మనం ఏకాంతంగా నమాజ్ ఆచరించవచ్చు.

ఒకసారి హజ్రత్ గారు అలైహిస్సలాం నాతో ఇలా అన్నారు. మియాఁ అబ్దుల్లాహ్! ఈ రోజుల్లో నాపై అల్లాహ్ తఆలా అనుగ్రహాల ద్వారాలు విశాలంగా తెరుచుకున్నాయి. కొన్నిసార్లు దేవుడు నాతో చాలా సేపు మాట్లాడుతూనే ఉంటాడు. ఈ సంఘటనలన్నింటినీ రాస్తే అవి ఎన్నో పేజీలు అవుతాయి. మియాఁ అబ్దుల్లాహ్ గారు వివరించిన ప్రకారం, 'పిస్రె మౌవూద్' (వాగ్దత్త పుత్రుడు) కి సంబంధించిన దైవవాణీలు కూడా ఈ చిల్లా సమయంలోనే అందినవి. ఆ చిల్లా ముగిసిన తర్వాత హోషియార్‌పూర్

నుండే హుజూర్ (అ) ఈ భవిష్యవాణిని ప్రకటించారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది ఫిబ్రవరి 20, 1886 తేదీ నాటి ప్రకటన. దీనిని జమాఅత్‌లో 'ముస్లిహ్ మౌవూద్' (రజి) భవిష్యవాణిగా కూడా పిలుస్తారు. నేడు కూడా ఫిబ్రవరి 20 కావడమనేది ఒక విశేషమైన కాకతాళీయం (దైవిక అమరిక). ఇది పిస్రె మౌవూద్ భవిష్యవాణి ఘనంగా నెరవేరిన రోజు కూడా. ఆ వాగ్దత్త పుత్రుడు భవిష్యవాణికి అనుగుణంగానే జన్మించెను. యాభై రెండు సంవత్సరాల పాటు వారి ఖిలాఫత్ కొనసాగింది. అల్లాహ్ తఆలా వారిని అనేక విజయాలతో ఆశీర్వదించాడు. ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణిలో ఉన్న ఆ భవిష్యవాణీలు, దైవవాణీలు, విషయాలన్నీ హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ (రజి) గారి వ్యక్తిత్వంలో పరిపూర్ణంగా నెరవేరాయి. నేను దీనిని ఒక విశేషమైన అమరిక అని ఎందుకు అంటున్నానంటే ఈ సంఘటన సరిగ్గా ఈ రోజే నా ముందుకు వచ్చింది. లేదంటే ఇది ముందుగానీ లేదా వెనుకగానీ రావచ్చు. కానీ అల్లాహ్ తఆలా సంకల్పం దీనిని ఈ రోజే తీసుకురావాలని, నేను దీనిని వివరించాలని ఉద్దేశించింది. దీనికి సంబంధించి ప్రస్తుతం జమాఅత్‌లో సభలు కూడా జరుగుతున్నాయి. వాటి ద్వారా చరిత్ర గురించి తెలుస్తుంది. ఎమ్.టి.ఏ. (ముస్లిం టెలివిజన్ అహ్మదియ్యహ్)లో కూడా కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి, వాటిని కూడా తప్పకుండా దర్శించవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఆ రోజుల్లో ఫతహ్ ఖాన్ చాలా భక్తిశ్రద్ధలు కలిగి ఉండేవాడు మరియు నేను హజ్రత్ గారిని ప్రవక్తగా భావిస్తానని చెప్పేవాడు. కానీ అతనికి ఎప్పుడైతే పరీక్ష ఎదురైందో అప్పుడు అతను ధర్మభ్రష్టుడు అయిపోయాడు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హుజూరె అన్వర్ ఇట్లు హెచ్చరించారు. అందుకే మనిషి ఎల్లప్పుడూ తన అంతిమ ముగింపు శుభప్రదంగా ఉండాలని, తన విశ్వాసం దృఢంగా ఉండాలని ప్రార్థిస్తూ, నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి. ప్రత్యేకించి ఈ రమజాన్ మాసంలో చేసే ప్రార్థనలలో, అల్లాహ్ తఆలా మన అంతిమ ముగింపును శుభప్రదంగా చేయాలని, మనల్ని విశ్వాసంలో స్థిరంగా ఉంచాలని ప్రతి ఒక్కరూ తప్పకుండా దుఆ (ప్రార్థన) చేయవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదేవిధంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి నమాజు ఆచరణకు సంబంధించిన మరొక సంఘటన ఇట్లుంది. కొందరు వ్యక్తులు నమాజు ధార్మిక నియమాల గురించి అనగా చేతులు ఎలా కట్టుకోవాలి, నమాజులోని వివిధ కదలికలు ఎలా ఉండాలి అని అడుగుతుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి నమాజు పద్ధతిని వివరిస్తూ మియాం అలీ ముహమ్మద్ గారిలా అన్నారు. ఒకసారి నేను హుజూర్ (అ) సున్నత్ నమాజు ఆచరిస్తుండగా చూశాను. హజ్రత్ గారు తమ చేతులను బొడ్డుకు పైభాగంలో కట్టుకున్నారు. వారి కుడిచేతి మధ్య వేలు దాదాపు మోచేయి వరకు చేరుతోంది లేదా అంతకంటే కొంచెం వెనక్కి ఉంది. సజ్దా (సాష్టాంగం) చేసే సమయంలో వారు తమ రెండు చేతుల మధ్య నుదుటిని, ముక్కును నేలకు ఆన్చేవారు. వేళ్లు నేరుగా కాబా దిశలో ఉండేవి. వారు సజ్దా నుండి లేచినప్పుడు వారి తలపాగా కొంచెం వదులుగా ఉండటం వల్ల వెనక్కి జరిగేది, దానిని వారు తమ వేలితో సరిచేసుకునేవారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి తహజ్జుద్ నమాజు స్థితిని వివరిస్తూ హజ్రత్ మాస్టర్ నజీర్ హుస్సేన్ గారిలా వ్రాశారు. రాత్రి సుమారు మూడు గంటల సమయంలో నేను హుజూర్ (అ) నమాజు ఆచరిస్తుండగా చూశాను. నేను కూడా వుజూ చేసుకుని హుజూర్ గారి వెనుక కొంత దూరంలో నమాజు చదవడం ప్రారంభించాను. హుజూర్ గారు ఎంత సమయం అయితే ఖియామ్,

రుకూ లేదా సజ్దా చేస్తున్నారో, నేను కూడా అంత సమయం చేయాలని ఎంతో ప్రయత్నించాను, కానీ చేయలేకపోయాను. కేవలం రెండు రకాత్‌లలోనే నేను తీవ్రంగా అలసిపోయాను, కానీ హుజూర్ (అ) అప్పటికి నేను ఏ రకాత్‌లో అయితే చేరానో అదే రకాత్‌లో ఉన్నారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు. పగటిపూట మేమందరం హుజూర్ గారి చుట్టూ కూర్చున్నప్పుడు, వారు జమాఅత్‌కు తహజ్జుద్ నమాజు చదవమని నొక్కి చెబుతున్నారు. అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను. ఒకవేళ తహజ్జుద్ చదవలేకపోతే, కనీసం ఏమి చేయాలి? దానికి హుజూర్ (అ) ఇలా సమాధానమిచ్చారు. ఆ సమయంలో (రాత్రి వేళ) అధికంగా ఇస్తిగ్ఫార్ (క్షమాపణలు) వేడుకోవాలి, దేవుని తస్బీహ్, తహ్మీద్ ఎక్కువగా చేయాలి. దీనివల్ల తహజ్జుద్ చదివే అనుగ్రహం లభిస్తుంది.

హుజూరె అన్వర్ ఇట్లు గుర్తుచేశారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నేర్పిన ఈ దువాలు తహజ్జుద్‌కు ప్రత్యామ్నాయం అవుతాయని కాదు, కానీ వీటి వల్ల తహజ్జుద్ చదివే భాగ్యం లభిస్తుంది. కాబట్టి మనం కూడా అలసత్వం ఆవహించిన రోజుల్లో ఈ పద్ధతినే అవలంబించవలెను.

ప్రస్తుతం మనం రమజాన్ మాసంలో ఉన్నాం. కావున తహజ్జుద్ చదివే అవకాశం ఎలాగో కొంతవరకు లభిస్తుంది. ఒకవేళ లభించకపోయినా ప్రయత్నించవలెను. నిస్సందేహంగా మసీదులలో తరావీహ్ నమాజులు కూడా నిర్వహించబడుతున్నాయి. ఇది బలహీనులకు లేదా ఉదయాన్నే సరైన సమయానికి నిద్రలేవలేని వారికి లేదా ఎక్కువ సమయం కేటాయించలేని వారికి ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుంది. అయితే ఇది అసలైన హక్కును నెరవేర్చే ప్రత్యామ్నాయం మాత్రం కాదు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి సున్నత్, వారి సత్య దాసులైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పద్ధతి ఎట్లుండెననగా రాత్రి వేళ మేల్కొని వారు తహజ్జుద్ ఆచరించేవారు. కనుక మీరు తరావీహ్ చదివినప్పటికీ, కనీసం రెండు లేదా నాలుగు రకాత్ నఫిల్ నమాజులైనా సరే, ఖచ్చితంగా తహజ్జుద్ చదవడానికి ప్రయత్నించవలెను.

ముగింపులో హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా బోధించారు. ప్రపంచ వ్యవహారాలను పూర్తిగా వదిలేయకూడదు. అల్లాహ్ తలా ప్రసాదించిన వరాలను గౌరవించాలి. ప్రతి ఒక్కరూ తమ పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచంలో మరీ లోతుగా మునిగిపోకుండా చూసుకోవాలి. ఇదేవిధంగా ప్రపంచ బాధ్యతలను పూర్తిగా విస్మరించేంతగా సన్యాసుల్లాగా కూడా మారిపోకూడదు. ఇస్లాం బోధించిన మధ్యేమార్గాన్నే అవలంబించవలెను.

రెండవ ఖుత్బా కంటే ముందు హుజూరె అన్వర్ పవిత్ర రమజాన్ సందర్భంగా ఆరాధనల హక్కును నెరవేర్చాలని, అన్యాయానికి గురవుతున్న అహ్మదీల కోసం, దైవమార్గంలో బందీలుగా ఉన్న వారి కోసం, ముస్లిం సమాజం కోసం మరియు ఈ ప్రపంచం వినాశనం నుండి రక్షించబడటం కోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని పిలుపునిచ్చారు.

اَلْحَمْدُلِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔